క్లుప్తంగా

ప్రజా సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ రమణారెడ్డి

సి.బెళగల్: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి, ఆదోని డీఎల్‌డీఓ రమణారెడ్డి సూచించారు. ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి పంచాయతీ కార్యదర్శులతో (పీఎస్‌లతో) సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టే పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని చేపట్టాల్సిన పనులపై అధికారులు పీఎస్‌లకు సూచనలు చేశారు. యోగా దినోత్సవం పకడ్బందీగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


సి.బెళగల్ మోడల్ స్కూల్లో బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని మోడల్ స్కూల్లో బదిలీ ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ వంశీమోహన్, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మోడల్ స్కూల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ, బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్తున్న సందర్భంగా ఐదుగురిని మంగళవారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సత్కరించారు. బదిలీ అయిన బాలాజీ (గణితం), శ్రావణి (రసాయనశాస్త్రం), వీరభద్రమ్మ (హిందీ), శారద (ఇంగ్లిష్), రవి (తెలుగు) ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ధనుంజయ గౌడ్, రవికిరణ్, రాధ తదితరులు ఉన్నారు.

డీఎస్సీ పరీక్ష కేంద్రాల తనిఖీ


పరీక్ష కేంద్రం వద్ద అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం,శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలను మంగళవారం పలువురు అధికారులు తనిఖీ చేశారు. ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారి సుబ్రమణ్యం సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఎస్‌ఐ నరేంద్రకుమార్ కేంద్రం వద్ద బందోబస్త్ చేపట్టారు.

సమయపాలన పాటించండి


తిరుపాడు గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని నంద్యాల జిల్లా అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ శారదా బాయి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ కిరణ్‌కు కోరారు. అలాగే ఆసుపత్రిలోని టీబీ రికార్డులను పరిశీలించి రోగులకు సక్రమంగా మందులుఅందజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పీహెచ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన నిర్వహించాలన్నారు. అనంతరం మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో జరుగుతున్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, ఏఎన్‌ఎం మౌలాబి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల విషయంలో దళారులను నమ్మొద్దు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పోస్టుల భర్తీపై దళారుల మాట నమ్మవద్దని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మెడికల్ కాలేజీల్లో వివిధ కేటగిరీలకు చెందిన పోస్టుల భర్తీ విషయంలో ఫైనల్ మెరిట్ లిస్ట్‌ను పూర్తిగా నియమ నిబంధనల మేరకు రూపొందించామని, ఈ పోస్టుల భర్తీ లో ఎలాంటి అక్రమాలకు తావులేదని, ఎవరైనా దళారులు ప్రలోభాలకు గురిచేస్తే నమ్మ వద్దని సూచించారు. ప్రలోభాలకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 19న జరిగే కౌన్సెలింగ్‌లో కార్డియాలజీ టెక్నీషియన్ పోస్టులకు కౌన్సెలింగ్ ఉండదన్నారు. దీన్ని మళ్లీ ప్రకటిస్తామన్నారు. సర్టిఫికెట్లు ఒరిజినల్ అని తేలిన తర్వాతే వేతనాలు చెల్లిస్తామని, నకిలీవని తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజాగ్రహం

- ఏడాది పాలనలో సూపర్‌సిక్స్ హామీలు ఏమయ్యాయి?
- హామీల పేరుతో 5 కోట్ల మందికి చంద్రబాబు వెన్నుపోటు
- ప్రభుత్వం హామీలు అమలుచేసే వరకు ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం
- కల్లూరు మండలం పుసులూరులో వెన్నుపోటు బుక్‌లెట్ ఆవిష్కరణ


వెన్నుపోటు బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ కల్లూరు మండల అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి, పార్టీ శ్రేణులు

కర్నూలు(టౌన్): జగనన్న కన్నా రెండింతలు సంక్షేమ పథకాలు ఇస్తానని చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు పాలనలో ఘోరంగా వైఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ కల్లూరు మండలాధ్యక్షుడు రామక్రిష్టా రెడ్డి అన్నారు. మంగళవారం పాణ్యం నియోజకవర్గం పరిధిలోని కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో 'జగనన్న అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' వెన్నుపోటు, అరాచక పాలన, ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ఏడాది పాలన చీకటి రోజులను తలపించిందన్నారు. మహిళలను, రైతులను, నిరుద్యోగులను, ఉద్యోగులను ఇలా.. ప్రతి ఒక్కరినీ కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు ఏ ఒక్కటీ అమలు చేయలేదని మండిపడ్డారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, యాభై ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలందరికీ రూ.4 వేలు పెన్షన్, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తామని ప్రశ్నించారు. ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి 4 లక్షల మందిని రోడ్డున పడేశారన్నారు. రైతులకు రైతు భరోసా, క్రాప్ ఇన్సూరెన్స్, ఏటా రూ.20 వేలు పెట్టుబడి ఇస్తామని చెప్పి రెండవ ఏడాది తొలకరి ప్రారంభమైనా ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. మహిళలు చంద్రబాబును నమ్మితే వారిని నట్టేట ముంచారన్నారు.

హామీలపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీపై అక్రమ కేసులు

ఏడాది పాలనలో ప్రజలకు, రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, సోషల్ మీడియా శ్రేణులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం, జైళ్లకు పంపించడం చంద్రబాబు నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని ప్రజలు అన్ని గమనిస్తున్నారని స్పష్టం చేశారు. ఏడాదిలోనే ఈ ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ నెల 4న వైఎస్సార్‌సీపీ నిర్వహించిన వెన్నుపోటు నిరసన కార్యక్రమానికి ప్రభుత్వం భయపడి 'తల్లికి వందనం' నిధులు మంజూరు చేశారన్నారు. చంద్రబాబు చెప్పిన ప్రతి హామీని అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కల్లూ రు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనంతా అరాచకమే


సి.బెళగల్‌లో వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

సి.బెళగల్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అరాచకాలే తప్పా అభివృద్ధి, ప్రజా సంక్షేమం జీరో అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ సీబీ గోవిందరెడ్డి ఇంటి వద్ద సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు 'జగనన్న అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు ఏడాది పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలపై చీకటి అములుకుందన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహుడు, మద్దిలేటి, గోపాల్, రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసి రెడ్డి, ఎస్‌ఎం బాషా, నాయకులు లింగేష్, బ్రాహ్మణదొడ్డి సర్పంచ్ దస్తగిరి, గ్రామ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం


కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై గూడూరులో పుస్తకావిష్కరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్: 'జగనన్న అంటే నమ్మకం.. చంద్రబాబు అంటేనే మోసం' అనే విషయం ప్రజలందరికీ అర్థమైందని గూడూరు మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు అన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై ముద్రించిన పుస్తకాన్ని మంగళవారం గూడూరులో వైఎస్సార్‌సీపీ మండల, టౌన్ అధ్యక్షులు రామాంజనేయులు, ఆబెల్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజలంతా కూటమి పాలనను జగనన్న గత పాలనతో పోల్చి చూస్తూ తాము ఎంత మోసపోయామో గ్రహించారన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు విధ్వంసమైపోయాయని, కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ప్రజలకు చీకటి రోజులను మిగిల్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని అరకొరగా అమలుచేశారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల, టౌన్ అధ్యక్షులు రామాంజినేయులు, ఆబెల్ నాయకులు.. గోపాల్, కుమార్, రామచంద్రుడు, సుందరం, లక్ష్మన్న, సుంకన్న, ఖాసీం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం


గడివేముల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

గడివేముల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మధుసూధన్, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్ బీ చంద్రశేఖర రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ విమర్శించారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబంటే మోసం పుస్తకాన్ని పార్టీ శ్రేణులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఏడాది సంక్షేమ క్యాలెండర్ పక్కాగా అమలు చేసి రాష్ట్రాన్ని సంక్షేమాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో సంపద సృష్టి లేదని, అప్పులకు అడ్రస్‌గా మార్చారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం నిర్వీర్యమయ్యాయన్నారు. వైఎస్ జగన్ రైతు సంక్షేమానికి పేదల వైద్యానికి, ఆరోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. నేడు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులే లక్ష్యంగా కూటమిప్రభుత్వం పాలన సాగుతుందని విమర్శించారు. తల్లికి వందనం కొందరికే అమలు చేశారని, నిరుపేదలకు రాలేదన్నారు. కార్యక్రమంలో వైస్సార్ సీపీ ఎంపీటీసీ వంగాల మహేశ్వర రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ చంద్ర శేఖర రెడ్డి, నాయకులు నాగేశ్వర రెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన


ఓర్వకల్లులో వెన్నుపోటు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఓర్వకల్లు: రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జీకే వెంగన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఓర్వకల్లులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వం తీరును నిరసించారు. బాబు వెన్నుపోటు పేరుతో కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథగౌడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ నాగతిరుపాలు, గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, ఐటీ విభాగం రాష్ట్ర సభ్యులు శివకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ, స్టూడెంట్ విభాగం సభ్యులు రాజ్‌కుమార్ అతిథులుగా హాజరయ్యారు. ఎంపీపీ తిప్పన్న మాట్లాడుతూ కూటమి సర్కారు నేరపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది నమ్మకమైన పాలన అయితే చంద్రబాబుది నయవంచన పాలన అని విమర్శించారు. గత ప్రభుత్వం హయాంలో పేదల సంక్షేమం, సమగ్రాభివృద్ధి జరిగితే ప్రస్తుత కూటమి పాలనలో రాజ్యాంగ ఉల్లంఘన, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, వేధింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం తీసుకొచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. నేడు చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు చేస్తూ ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులతో అణిచివేస్తున్నాడన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ఏపీ ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. రాబోయే రోజుల్లో ఆయనకు రాజకీయ సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఉస్మాన్‌బాషా, పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, సుంకిరెడ్డి, రామకృష్ణారెడ్డి, మధుమోహన్, జెల్లా కృష్ణ, అల్వస్వామి, గోపా.మోహన్‌రెడ్డి, రామేశ్వరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చెట్ల. అనిల్‌కుమార్, మాజీ సర్పంచులు కుర్వ పెద్దయ్య, చిన్న అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

కుంటుపడిన అభివృద్ధి

- బాబు చీకటి పాలనపై పుస్తక ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు


పాణ్యంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, పేదలు అంధకారంలోకి నెట్టివేయబడ్డారని మాజీ జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సద్దల సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పాణ్యం పార్టీ కార్యాలయం వద్ద కూటమి ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ పుస్తక ఆవిష్కరణ' కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు, హత్యలు, మహిళలపై అఘాయిత్యాలులు పెరిగిపోయాయన్నారు. సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు దూరమయ్యాయని చెప్పారు. ఏదో ఒక్క కొర్రీతో ప్రజలకు పథకాలు రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజలకు వైఎస్ జగన్ అంటే నమ్మకం .. చంద్రబాబు అంటే మోసం గుర్తుకొస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ఏడాది గడిచినా అతీగతీ లేదన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం మోసాలను తాము ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. బాబు పాలనలో ప్రతి రంగం నిర్వీర్యమైందని చెప్పారు. కార్మికులు, రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటి వరకు వారికి ఆదుకునే చర్యలు లేవన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు రామలక్ష్మయ్య, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు వెల్డింగ్ చాంద్, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, ఆటోమాబు, కృష్ణారెడ్డి, ఎల్లగౌడ్, బాబీ, రోషన్, లింగమయ్య, బాలిరెడ్డి, మహేష్, చిన్న ఎల్లసుబ్బయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

అదనులోనే పత్తి విత్తుకోవాలి


రైతులకు పత్తి సాగులో మెలకువలను వివరిస్తున్న ఏడీఏ సాలురెడ్డి, ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: భూమిలో తేమ శాతం ఉన్నప్పుడే పత్తి పంటను సాగు చేసుకోవాలని, మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందులను వాడరాదని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం కోడుమూరులో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి పత్తి పంట సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ సాలురెడ్డి మాట్లాడుతూ.. పత్తి పంట సాగు చేసి 15 రోజులు గడిచిన తర్వాత ఎకరాకు ఒక బస్తా డీఏపీ గానీ కాంప్లెక్స్ ఎరువు వేయాలని సూచించారు. 20 రోజుల తర్వాత రసం పీల్చే పురుగు, దోమగానీ కన్పించిన ఎడల వేపనూనెను స్ప్రే చేసుకోవాలని, పచ్చ, తెల్ల దోమ నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

అనంతరం ఏడీఏ సాలురెడ్డి, ఏఓ రవిప్రకాష్ మండలంలోని పులకుర్తి రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, రైతులకు అందుబాటులో ఉండాలని ఏడీఏ ఆదేశించారు.

గూడూరులో..

వర్షాలు కురుస్తున్నందున రైతులంతా సకాలంలో పత్తి, కంది వంటి పంటలను సాగు చేసుకోవాలని గూడూరు ఏఓ దస్తగిరి రెడ్డి సూచించారు. మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా గూడూరు వ్యవసాయ కార్యాలయంలో ఏఓ రైతులతో సమావేశం నిర్వహించి ఖరీఫ్ పంటల సాగుపై చర్చించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: కల్లూరు మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగశేషాచల రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను తీసుకుని హాజరుకావాలని సూచించారు. అలాగే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి రావాలని కోరారు.

'ఈగల్' చేతికి సెక్యూరిటీ సేవలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు బోధనాసుపత్రి సెక్యూరిటీ సేవలు ఈగల్ హంటర్ సొల్యూషన్స్ అనే సంస్థ దక్కించుకుంది. ఈ నెల నుంచే ఈ సంస్థ తన సేవలను ఆసుపత్రిలో నిర్వహిస్తోంది. ఈ మేరకు మంగళవారం సంస్థ మేనేజర్ కే.జె. రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మను మర్యాదపూర్వకంగా కలిసి సంస్థ ఎంవోయూ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు మెడికల్ కాలేజీలో 40 మంది, ప్రభుత్వ ఆసుపత్రిలో 200 మంది, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో 11 మంది, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 60 మంది సెక్యూరిటీ గార్డులతో సేవలందిస్తామన్నారు. ప్రతి సెక్యూరిటీ గార్డుకు టోకుగా రూ.16 వేలకు పైగా జీతం వస్తుందని, పీఎఫ్, ఈఎస్‌ఐ మినహాయించుకుని ఒక్కొక్కరికి రూ.11వేల దాకా వస్తుందని తెలిపారు. త్వరలో సెక్యూరిటీ గార్డులకు నూతన యూనిఫాం అందజేస్తామన్నారు.

గొలుసు దొంగలు యూపీ ముఠాగా గుర్తింపు

కర్నూలు: కర్నూలులో ఈనెల 10వ తేదీన గంటన్నర వ్యవధిలో మూడు చోట్ల గొలుసు దొంగతనాలకు పాల్పడింది ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠాగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకాయపల్లె అపూర్వ హోమ్స్ కాలనీలో నివాసముండే లక్ష్మీదేవికి చెందిన 3 తులాల బంగారు గొలుసు, అలాగే మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాద్రి నగర్‌కు చెందిన యశోధ మెడలో మూడున్నర తులాల బంగారు గొలుసు, నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతోష్ నగర్‌లో నివాసముంటున్న భాగ్యలక్ష్మి మెడలోని 2 తులాల బంగారు గొలుసును ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై వెంబడించి లాక్కొని పరారయ్యారు. అదే రోజు డోన్, నంద్యాల ప్రాంతాల్లో కూడా ఇదే ముఠా సభ్యులు గొలుసు దొంగతనాలకు పాల్పడి కర్నూలు మీదుగా హైదరాబాదుకు వెళ్లి అక్కడ కూడా మూడు చోట్ల గొలుసు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. సెల్‌ఫోన్ డంప్, సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను ఉత్తరప్రదేశ్ వాసులుగా గుర్తించినట్లు తెలిసింది. వారు వాడిన ద్విచక్ర వాహనం ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్నట్లు సీసీ ఫుటేజీలో ఆధారాలు లభించడంతో దొంగలను పట్టుకునేందుకు సీసీఎస్ పోలీసుల బృందం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లినట్లు సమాచారం.

సస్యరక్షణ పద్ధతులపై అవగాహన


సి.బెళగల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండల రైతులు సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం సి.బెళగల్‌లో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు ముందస్తుగా విత్తుకున్న పత్తి పంటలను పరిశీలించి, పంట సస్యరక్షణ పద్ధతులను తెలియజేశారు. పత్తి పంటలో శనగపచ్చ రసం పీల్చే పురుగును గమనించి వేప నూనె లేదా మోనోక్రోటోఫాస్, లేదా ఇమిడా క్లోరోఫిడ్‌ను లీటరు నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి, సబ్సిడీ వ్యవసాయ యంత్రాలపై అవగాహన కల్పించారు. ఏఈఓ హిమబిందు, వీఏఏ అసీఫ్, ఎంపీఈఓలు వెంకటేష్, సునంద, రైతులు ఉన్నారు.

ధూమపానంతో క్షయ ముప్పు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘు

కర్నూలు(హాస్పిటల్): పొగ తాగే అలవాటు ఉన్న వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. ఆయన మంగళవారం కర్నూలు మండలం పడిదెంపాడు గ్రామంలో నిర్వహిస్తున్న టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, 60 ఏళ్లు పైబడిన వారు, పొగ తాగేవారు, మద్యం సేవించేవారు, పౌష్టికాహార లోపం ఉన్న వారికి టీబీ గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. ఇందులో భాగంగా నిక్షయ్ వాహన్, నిక్షయ్ శిబిరాలు ఏర్పాటు చేసి జన భగీదారిలో భాగంగా గ్రామంలో ప్రజలకు టీబీ గురించి తెలపాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ అనిద్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, పీహెచ్‌ఎస్ హనుమంతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ నాగమణి, ఆరోగ్య కార్యకర్త కళావతి, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై దృష్టి సారించాలి

- కలెక్టర్ రాజకుమారి


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

పాణ్యం: సాంకేతిక విద్యపై దృష్టి సారిస్తే ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా విద్యార్థులకు సూచించారు. మంగళవారం పాణ్యం మండలం సుగాలిమెట్ట వద్ద ఏపీ మోడల్ స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, నెలకొన్న సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అర గంట పాటు ఉపాధ్యాయురాలిగా మారిపోయి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించారు. చాక్‌పీస్ చేతబట్టి బోర్డు రాసి క్లుప్తంగా వివరించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి ఉత్సాహ పరిచారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం రుచి చూసి విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రహరీ నిర్మాణం, రోడ్డు సౌకర్యం, బస్సు పాఠశాల వద్దకు చేరుకోవడం వంటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ దినేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ భారతి, ఎంఈఓ కోటయ్యను ఆదేశించారు.

జాయింట్ ఎల్‌పీఎంల సమస్య పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: ఉలిందకొండ గ్రామంలో పేదలు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములకు జాయింట్ ఎల్‌పీఎంలు పడ్డాయని, ఈ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఉలిందకొండ గ్రామ రైతులు కల్లూరు మండల తహసీల్దార్ రామాంజనేయులును కలిసి వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు ఒ. మధు మాట్లాడుతూ మండలంలో ఉలిందకొండ, కొల్లంపల్లి తండా, ఎరక్రత్వ, యాపర్లపాడు, ఓబులాపురం లాంటి గ్రామాల్లో ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. అయితే, రీ సర్వేలో ప్రభుత్వ భూములు అన్నింటికీ ఒకే ఎల్‌పీఎం నెంబర్ వేయడంతో వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులుగా చూపించబడుతున్నారని చెప్పారు. దీతో ఉలిందకొండ గ్రామంలోనే దాదాపుగా 90 మంది రైతులు తల్లికివందనం పథకానికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పూలరంగడు, తాండ గోపాల్, రమేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మీబాయి, సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన

కర్నూలు (టౌన్): కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామం జగన్నాథగట్టు వద్ద ఉన్న టిడ్కో గృహాలకు ఎదురుగా ఆరు ఎకరాల్లో గ్రీన్‌కో కంపెనీ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం, క్రీడా కాంప్లెక్స్‌కు మంగళవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడు తూ కర్నూలులో కేంద్రీకృత స్టేడియం ఉండాలన్న ఉద్దేశంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, కే.ఈ.శ్యాంబాబు, జయనాగేశ్వర రెడ్డి, బొగ్గుల దస్తగిరి మాట్లాడారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, గ్రీన్ కో కంపెనీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రాజక్టు డైరెక్టర్ నాయుడు, ఆర్డీఓ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణలను ఉపేక్షించొద్దు

కర్నూలు (టౌన్): నగరంలో ఆక్రమణలను ఉపేక్షించవద్దని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవార సాయంత్రం స్థానిక నగర పాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో మున్సిపల్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రణాళిక విభాగం కృషి చేయాలన్నారు. ఆక్రమణలు తొలగించాలని, వెండర్స్ జోన్‌లను ఏర్పాటు చేయాలని, రహదారులపై తోపుడు బండ్లు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి వ్యాపారులు ఎంత మంది ఉన్నారో? ఎంత మంది అనుమతులు తీసుకున్నారో? తనకు వారం రోజుల్లో నివేదిక అందజేయాలన్నారు.

– అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లు 5 శాతం కన్నా ఎక్కువ లెస్‌కు పోవద్దని మంత్రి సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ బోర్డు ద్వారా నాణ్యత ప్రమాణాలు తనిఖీ చేశాకే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.